ఖైరతాబాద్‌లో ఓటేసిన 1,50,653 మంది

బంజారాహిల్స్, మే 14: లోక్‌సభ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం 50.28 గా తేలింది. సోమవారం సాయం త్రం పోలింగ్ ముగిసిన తర్వాత అన్ని పోలింగ్ బూత్‌లనుంచి వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించిన తర్వాత పోలింగ్ శాతాన్ని అధికారికంగా నిర్ధారించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో మొ త్తం 2,99,651మంది ఓటర్లకు.. 1,50,653 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో 78,153 మంది పురుషులు, 72,490 మంది మహిళలు ఉన్నారు. వీరితో పాటు 10 మంది థర్డ్ జెండర్లు కూడా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి..

హిమాయత్‌నగర్, మే 14: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడు తూ.. అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్రం నిర్లక్ష్యం వహి స్తూ, ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన స్ట్రాంగ్ రూం వద్ద రాజకీయ పార్టీల నేతలతో ఆర్వో, జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఏఆర్ఓ నయీముద్దీన్

బ్యాలెట్ బాక్సులు భద్రంగా..

స్టేడియం చుట్టూ మూడంచెల భద్రత..

జూబ్లీహిల్స్, మే 14 : జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 329 పోలింగ్ స్టేషన్ల నుంచి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను ఎన్నికల అధికారులు పటిష్ట బందోబస్తు మధ్య యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఆయా బాక్సులను నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో స్ట్రాంగ్ రూంల్లో భద్రపరిచారు. సోమవారం రాత్రి జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ జూబ్లీహిల్స్ డీఆర్‌సీ సెంటర్‌ను సందర్శించి పరిస్థితిని పర్యవేక్షించగా మంగళవారం తెల్లవారుజామువరకు అధికారులు పకడ్బందీగా ఈ ప్రక్రియను నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు సరోజ్ కుమార్ సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఏఆర్ఓలు.. ఆర్డీఓ దశరథ్ సింగ్ రాథోడ్, డీసీ సేవా ఇస్లావత్, తాసీల్దార్ నయీముద్దీన్‌లతో కలిసి స్ట్రాంగ్ రూమ్‌లో బాక్సులను బందోబస్తు నడుమ భద్రపరిచారు. జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ చేపట్టే వరకు స్టేడియం చుట్టూ సీఆర్‌పీఎఫ్ బలగాలతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో పెరగని ఓటింగ్ శాతం..

- బాధ్యతను విస్మరించిన ఓటరు..
- ప్రతి ఎన్నికల్లో అత్యల్ప ఓటింగ్..
- ఈసారి మరీ తగ్గిన పోలింగ్..

జూబ్లీహిల్స్, మే 14 : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రతి ఎన్నికల్లో ఓటింగ్ శాతం అత్యల్పంగా నమోదుకావడం ఎన్నికల సంఘం అధికారులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. విద్యావంతులతో పాటు పేద, ధనిక, రాజకీయ, సినీ వర్గాలుండే ఈ ప్రాంతంలో ఎన్నికలు ఏవైనా ఓటింగ్ శాతం మాత్రం పెరగడం లేదు. ఎన్నికలపై అనాసక్తితో నగరంలోనే ఉన్న ఓటరు గడప దాటకపోవడంతో ఓటింగ్ శాతం ప్రతిసారి తగ్గిపోతుంది. ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి బూడిదలో పోసిన పన్నీరుగా మారుతున్నాయి. సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో కేవలం 45.79 శాతం పోలింగ్ నమోదయింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 47.49 శాతం ఓటింగ్ నమోదుకాగా నాలు గు నెలల వ్యవధిలో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం మరింత తగ్గడం విశేషం. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో 3,87,056మంది ఓటర్లుండగా 1,77,243 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. జూబ్లీహిల్స్‌లో ప్రతిసారి పోలైన ఓట్లకంటే పోల్‌కాని ఓట్లు ఎక్కువగా ఉంటున్నాయి. ఎన్నికల అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఓటర్లు పెరిగారుగానీ ఓటింగ్ శాతం మాత్రం పెరగలేదు.

వివేచన ఉన్నా.. విస్మరిస్తున్నారు..

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటు వేసిన వాళ్లకంటే ఓటు వేయనివారు అధికంగా ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 1,77,243 మంది ఓటు వేయగా 2,09,813 మంది ఓటు వేయలేదు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్న వివేచన ఉన్న విద్యావంతులైన ఓటర్లు బాధ్యతను విస్మరిస్తున్నారు. ప్రభుత్వం సెలవు ప్రకటించినా ఉద్యోగులు ఓటు వేసేందుకు అనాసక్తి కనబరుస్తున్నారు. ఈసారి వీకెండ్ కారణంగా వరుస సెలవులు రావడం తో ఎన్నికలకు ప్రకటించిన సెలవును కొంతమంది పూర్తిగా సద్వినియోగం చేసుకున్నారు. కారణం ఏదైనా.. ఎన్నికలు ఏవైనా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రతి ఎన్నికల్లో అత్యల్ప ఓటింగ్ నమోదవుతుంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి వెచ్చించాల్సిన ఒకగంట సమయాన్ని విశ్రాంతి తీసుకోవడానికో.. విహారానికి వెళ్ళేందుకో వృథా చేస్తున్నా రు. దీంతో ఐదు నిముషాలు ఆలోచించి ఐదేండ్లు మనలను పరిపాలించాల్సిన మంచి నేతను ఎన్నుకోవడంలో విఫలం అవుతున్నా రు. దీంతో అత్యల్ప ఓటిం గ్ శాతమే ప్రతి ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం పరిపాటిగా మారిపోయింది.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

ఎస్ఓఎస్ సంస్థ సీఈవో సుమంతకర్

మైలార్‌దేవ్‌పల్లి, మే 14: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం అవుతూ మరింత ముందుకు సాగాలని ఎస్ఓఎస్ సంస్థ సీఈవో సుమంత కర్ అన్నారు. మంగళవారం గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామంలోని ఎస్ఓఎస్ బాలల గ్రామంలో స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్ఐడీబీఐ) వారి సహకారంతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈడీపీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఓఎస్ సంస్థ సీఈవో సుమంత కర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వట్టినాగులపల్లిలోని ఎస్ఓఎస్ సంస్థలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఎంటర్‌ప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల నైపుణ్యాలు, వ్యాపారాలను అభివృద్ధి చేయడం ద్వార వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చవచ్చునన్నారు. ఎస్ఐడీబీఐ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జనరల్ మేనేజర్ చంద్రమౌలి, డిప్యూటీ మేనేజర్ రామకృష్ణలు మాట్లాడుతూ.. ఈ సంస్థ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అందిస్తున్న పథకాలను వివరించి చిన్న వ్యాపారులను ప్రోత్సహించడానికి ఎల్లవేళలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. లివింగ్ హుడ్ డైరెక్టర్ జిజిత్‌కుమార్ మాట్లాడుతూ.. చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్న మహిళలకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం వివిధ సంస్థలు అందిస్తున్న ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలల గ్రామీణ సంచాలకులు కొట్రేష్ మాట్లాడుతూ .. ఎస్ఐడీబీఐ సంస్థ మహిళలకు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల్లో ఎస్ఓఎస్ సంస్థ ద్వారా లబ్ధిపొందుతున్న మహిళలు, ఎస్ఓఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

అబ్దుల్ షోయబ్ (ఫైల్)

కవాడిగూడ, మే 14 : ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బన్సీలాల్‌పేట బండమైసమ్మ నగర్ నివాసి అబ్దుల్ రజాక్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్దవాడైన అబ్దుల్ షోయబ్ (20) నిరుద్యోగి. రెండేండ్ల క్రితం రోడ్డు ప్రమాదం జరిగి రెండు కిడ్నీలు పాడయినాయి. దాంతో అతడు ఇంట్లోనే ఉంటున్నాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులకు అబ్దుల్ షోయబ్ ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే గాంధీనగర్ పీఎస్‌కు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేసుకున్న పోలీసులు గాంధీ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించినట్లు పోలీసులు తెలిపారు.

సనత్‌నగర్ నియోజకవర్గంలో.. 49.41 శాతం పోలింగ్

బేగంపేట్, మే 14: సనత్‌నగర్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల అధికారులు, పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,53,381 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం 6 గంటల వరకు 49.41 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. సుమారు యాభై శాతం మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా యాభై శాతం పోలింగ్ దాటలేదు. నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలోనూ ఉదయం 7 నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు వచ్చారు. సనత్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్, మోండామార్కెట్ డివిజన్‌లలో మొత్తం 229 పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 50.59 శాతం ఓటింగ్ జరుగగా ప్రస్తుతం 49.41 శాతమే పోలింగ్ జరిగింది.

సీబీఎస్ఈ ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

సిటీబ్యూరో, మే 14(నమస్తే తెలంగాణ)/హిమాయత్‌నగర్ : సీబీఎస్ఈ ఫలితాల్లో హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. తాజాగా వెల్లడైన ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణులయ్యారు. గత దశాబ్ద కాలంగా సీబీఎస్ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని ఆక్స్‌ఫర్డ్ యాజమాన్యం వెల్లడించింది. అకడామిక్ ఎక్సలెన్స్, నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణ, విద్యాబోధనలతో మెరుగైన ఫలితాలను సాధిస్తున్నామని పేర్కొంది. ఏ1, ఏ2 గ్రేడ్‌లతో మంచి స్కోర్ సాధించారని కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ తెలిపారు. వైస్‌చైర్మన్ ప్రార్థనా మణికొండ నేతృత్వంలో, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో విద్యార్థులకు మెరుగైన విద్యాబో ధనలు అందించడంతో ఫలితాల్లో మరోసారి సత్తా చాటినట్లు తెలిపారు. ఈ ఫలితాల్లో అనన్య, సయ్యద్ ఫహీద్ జంగ్, విశ్వేష్ రాజు, నిధిజైన్, అద్వైత్ బాదామి, అనుష్ శ్రీసంజన, యశ్వంత్ కవిడిదేవి, తదితర విద్యార్థులు ఏ1-గ్రేడ్ సాధించారని తెలిపారు. కాగా విద్యార్థులకు మంచి స్కోర్ సాధించడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రార్థన

గెలుపుపై ఎంఐఎం ధీమా..

మెహిదీపట్నం : ప్రజల మద్దతు తమకే ఉందని హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఎంఐఎం మరోసారి కైవసం చేసుకోవడం ఖాయమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం టోలిచౌకిలో ఎమ్మెల్యే ప్రజలను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజార్టీతో గెలువనున్నారని పేర్కొన్నారు. పోలింగ్‌లో ప్రజలు చురుకుగా పాల్గొన్నారని, పార్టీకి ఓటువేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

జ్ఞాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జ్ఞాన వేంకటేశ్వరస్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఆలయ నిర్వాహకులు రెండవ రోజు మంగళవారం 5.30గంటలకు సుప్రభాత సేవ, నిత్యారాధన తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

– బండ్లగూడ, మే 14

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

సగర కులస్తులకు ఆరాధ్యుడైన మహర్షి భగీరథ జయంతి వేడుకలు మంగళవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో భగీరథ మహర్షి విగ్రహానికి పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్‌తోపాటు సగర ఉప్పర సంఘం గ్రేటర్ హైదరాబాద్ నాయకులు పెద్ద సంఖ్యలో భగీరథ విగ్రహానికి నివాళులర్పించారు.

– బంజారాహిల్స్, మే 14

న్యాయవాది సాయి చంద్రహాస్‌కు గ్లోబల్ ఎక్సెలెన్సీ అవార్డు

సినీనటి శిల్పా శెట్టి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న న్యాయవాది సాయి చంద్రహాస్

జూబ్లీహిల్స్,మే 14: యూసుఫ్‌గూడ ప్రాంతానికి చెందిన యువ న్యాయవాది ఎం.సాయి చంద్రహాస్‌కు గ్లోబల్ ఎక్సెలెన్సీ అవార్డు (జీఈఏ) వరించింది. బ్రాండ్ ఎంపవర్ సంస్థ దేశంలో ప్రతి ఏటా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారిని ఎంపికచేసి ఈ అవార్డులు అందిస్తుంది. మంగళ వారం ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో న్యాయవాది చంద్రహాస్ సినీనటి శిల్పాశెట్టి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. అరుదైన అవార్డు దక్కడం పట్ల చంద్రహాస్ తల్లిదండ్రులు ఎంఎం నాయుడు, కిరణ్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో.. వంద శాతం ఉత్తీర్ణత..

జూబ్లీహిల్స్, మే14 : యూసుఫ్‌గూడలోని మహాత్మా గాంధీ మెమోరియల్ హైస్కూల్‌లో సీబీఎస్ఈ ఫలితాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. సోమవారం వెలువడిన ఫలితాల్లో 92 శాతం మార్కులతో బిందు వర్షిణి, లోహితలు స్కూల్ టాపర్స్‌గా నిలిచారు. గత పదేండ్లుగా ఎంజీఎం పాఠశాలలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎంఎం నాయుడు, ప్రిన్సిపాల్ కిరణ్ నాయుడు తెలిపారు.

మనమడు ఆర్యతో గాంధీ ఆటవిడుపు

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని గెలుపు కోసం నెల రోజులుగా విస్తృతంగా ప్రచారంలో తలమునకలైన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పోలింగ్ ముగియడంతో మనుమడితో ఆటలాడుడూ ఆటవిడుపు పొందారు. సోమవారం పోలింగ్ పూర్తయిన విషయం విదితమే. మంగళవారం ఇంట్లోనే తన మనుమడు ఆర్యవీర్‌తో ఆటలాడుతూ కార్టున్ వీడియోలను చూస్తూ ఎమ్మెల్యే గాంధీ సరదాగా గడిపారు.

– మియాపూర్, మే 14

మనుమరాలు ఐరాతో మాధవరం కాలక్షేపం

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో 40 రోజులపాటు బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం నిర్విరామంగా పనిచేసిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎన్నికల ఘట్టం ముగియడంతో మంగళవారం తన నివాసంలో కుటుంబ సభ్యులతో కాలక్షేపం చేశారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేయడం, సమావేశాలు నిర్వహిస్తూ...బిజీబిజీగా గడిపిన ఎమ్మెల్యే కృష్ణారావుకు ఇన్నాళ్లకు విరామం దొరికింది. మనుమరాలు ఐరాతో కలిసి ఆడుకుంటూ.. టీవీలో వార్తలు, క్రికెట్‌ను చూస్తూ సరదాగా గడిపాడు.

–కేపీహెచ్‌బీ కాలనీ, మే 14

బొట్టు బిల్లలతో జై శ్రీరామ్..



బొట్టు బిల్లలతో రూపొందించిన జై శ్రీరామ్ చిత్రాన్ని ప్రదర్శిస్తున్న పద్మావతి, సూర్యకుమారి, యోగలక్ష్మి, తదితరులు

ఖైరతాబాద్, మే 14 : అయోధ్యలోని శ్రీరామమందిర నిర్మాణం పూర్తయి ఏడాది కావస్తున్న సందర్భంగా మహిళా ఆర్టిస్టులు ఓ వినూత్న బహుమతిని రూపొందించేందుకు సంకల్పించారు. హైందవ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బొట్టు బిల్లలను పేర్చి జై శ్రీరామ్ ఆకారంలో తీర్చిద్ది తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉమెన్ ఆర్టిస్టు అసోసియేషన్ ప్రతినిధులు, మహిళా ఆర్టిస్టులు కాసుల పద్మావతి, సూర్యకుమారి, యోగలక్ష్మి ప్రతిభా, రజనీ, కోమలిలు ఆ అద్భుత చిత్రకళ రూపకల్పన విషయాలను వివరించారు. తాము చేపట్టిన ఈ వినూత్న ప్రక్రియకు అయోధ్య ప్రాజెక్టుగా నామకరణం చేశామన్నారు. బొట్టు బిల్లలతో జై శ్రీరామ్ ఆకారం తయారు చేయడానికి 16,314 నారింజ బిల్లలు, 3192 నీలం, 13,464 ఆకుపచ్చ మొత్తం 32,970 బిల్లలు వినియోగించామని వెల్లడించారు. 60గంటల్లో ఈ రికార్డు ఫీటును పూర్తి చేశామన్నారు. ఈ ఆకృతిని అయోధ్య శ్రీరామమందిరం వద్ద ఉన్న మ్యూజియంకు అప్పగిస్తామన్నారు.

అంతుచిక్కని ఓటరు నాడి.. నాయకుల్లో ఆందోళన

- పైకి ధీమా.. లోపల బెంగ
- ఎవరి లెక్కల్లో వారు బిజీ

అంబర్‌పేట, మే 14 : అంబర్‌పేట నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ సరళి ఆయా పార్టీల నాయకులను ఆందోళనలో పడేసింది. ఓటరు నాడి అంతుపట్టకపోవడంతో సంప్రదాయ ఓటింగ్‌పై ఆశలు పెట్టుకున్నారు. పోలింగ్ తీరు, బూత్‌ల వారీగా పోలైన ఓట్ల జాబితాను పట్టుకొని లెక్కలు వేసుకుంటూ మంగళవారం బిజీగా గడిపారు. ఐదు డివిజన్లు బూత్‌లలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయి ? తమకు ఎక్కువ ఓట్లు పడ్డట్లు తెలుస్తున్నదని, వేరొక బూత్‌లో ఎదుటి పార్టీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు పడినట్లు సమాచారం ఉందంటూ చర్చించుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, అనుచరులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోటీ ఉండటం.. పోలింగ్ తీరు సరిగ్గా పసి కట్టకపోవడంతో ఆయా పార్టీల నాయకుల్లో పైకి ధీమా కనిపిస్తున్నా.. లోపల బెంగ పట్టుకున్నట్లు తెలుస్తున్నది.

తెలంగాణ జిల్లాల నుంచి వచ్చిన వారే అధికం

డివిజన్లలోని బస్తీల్లో తెలంగాణ జిల్లాల నుంచి వచ్చి నివాసముంటున్న వారే అధికంగా ఉన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన పథకాలు వీరిని ఆకట్టుకుంటాయని, వారి ఓట్లు మొత్తం బీఆర్ఎస్‌కే పడ్డాయని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కేసీఆర్ చేసిన పథకాలను వివరించడం జరిగిందని, పార్టీ ప్రతి కార్యకర్త, నాయకుడు పార్టీ గెలుపుకోసం పని చేశాడని గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ వ్యక్తిత్వం మంచిదని, ఆయనను గెలిపిస్తే అందరికి అందుబాటులో ఉంటాడని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్లు జోరుగా ప్రచారం చేయడం వంటివి బీఆర్ఎస్‌కు అధిక సంఖ్యలో ఓట్లు పడేలా చేస్తాయని అనుకుంటున్నారు.

ఇక బీజేపీ ఎంపీ అభ్యర్థి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడం, ప్రధాని మోడీ ప్రభావం ఎక్కువగా ఉండడం, రామ మందిర నిర్మాణం జరగడం వంటివి అనుకూల అంశాలుగా చెప్పుకుంటున్నారు. పోలింగ్ సరళి కూడా తమకే అనుకూలంగా ఉందని నాయకులు గట్టిగా నమ్ముతున్నారు. విజయంపై ఎవరి ధీమా వారిదే అన్న చందంగా పరిస్థితి నెలకొన్నది. ఇక కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అంబర్‌పేట నియోజకవర్గంలో తనకు ఓట్లు బాగానే పడతాయని భావిస్తున్నారు. ఇప్పుడు పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేశారని, మైనార్టీల ఓట్లు అన్నీ తనకే పోలయ్యాయని భావిస్తున్నారు.

పెరిగిన పోలింగ్ శాతం

కంటోన్మెంట్ ఉప ఎన్నికలో ఓటేసేందుకు తరలిన ఓటర్లు • పెరిగిన ఓటింగ్‌తో ప్రధాన పార్టీల్లో ఉత్కంఠ

పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నిక మనకెందుకులే అనుకోకుండా ఈసారి ఓటుహక్కు వినియోగానికి కంటోన్మెంట్ నియోజకవర్గ ఓటర్లు ముందుకొచ్చారు. ఈ కారణంగానే గత ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్‌లో 47.14శాతం ఓటింగ్ నమోదైతే.. ఈసారి 51.61 శాతంగా నమోదై అందరి దృష్టిని ఆకర్షించింది. కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీ యువకులతో పాటు మహిళలు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల ఎదుట బారులు తీరారు.

– కంటోన్మెంట్, మే 14

శాసనసభ ఎన్నికల్లో పెరుగుతున్న పోలింగ్ శాతం, పార్లమెంటు ఎన్నికలు వచ్చే సరికి తగ్గుతున్నది. ఇందుకు ప్రధాన కారణం శాసనసభ పరిధి తక్కువగా ఉండటంతో ప్రతి ఓటు కీలకంగా మారి గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువ ఉంటాయి. అందుకే ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న అందరి వివరాలు తెలుసుకొని వలస ఓటర్లను రప్పించి మరీ ఓట్లేయించుకుంటున్నారు. దీంతో కంటోన్మెంట్‌కు జరిగిన ఉప ఎన్నికల పోలింగ్‌లో గతంలో కంటే 4శాతానికిపైగా పెరిగింది. అయితే పోలింగ్ శాతం పెరగడంతో ప్రధాన పార్టీల్లోని అభ్యర్థులకు ఉత్కంఠగా మారింది. పెరిగిన 4శాతం ఓట్ల కారణంగా గెలుపోటములపై ప్రభావితం చూపే అవకాశం ఉండడంతో లెక్కల్లో తలమునకలయ్యారు. ప్రధానంగా వార్డుల వారీగా నమోదైన ఓట్లను సరిచూసుకోవడంతో పాటు పోలింగ్ బూత్‌ల వారిగా లెక్కలు తెప్పించుకుని మరీ కుస్తీలు పడుతున్నారు. బస్తీలు, కాలనీల్లో ఉన్న ట్రెండ్‌ను తెలుసుకుంటూ మంగళవారం సైతం అభ్యర్థులు బిజీగా గడిపారు. ఈసారి మార్పు కోసమే ప్రజలు ఓటింగ్‌కు తరిలారని కాంగ్రెస్ పార్టీ అంటుండగా, తండ్రి, చెల్లిని కోల్పోయిన నివేదిత సాయన్నకు అండగా నిలిచేందుకు కంటోన్మెంట్ ఓటర్లు కదం తొక్కారని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నారు. మరోవైపు బీజేపీ శ్రేణులు మోడీ చరిష్మాతో ప